క్లుప్తంగా

ఎమ్మెల్యే శంకరనారాయణకు సన్మానం



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న బూదిలి గ్రామస్తులు

పెనుకొండ రూరల్: గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు గోరంట్ల మండలంలో ఉన్న చిత్రావతి వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే శంకరనారాయణ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పీఎంజీఎస్‌వై నిధుల ద్వారా రూ.8.52 కోట్లను మంజూరు చేయించారు. దీంతో గోరంట్ల మండలంలోని బూదిలి గ్రామానికి చెందిన గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు.

ఘనంగా బాలల దినోత్సవం

పావగడ: తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గోవిందప్ప, సహోపాధ్యాయుడు రేణుకా రాజ్, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల నిర్మాణం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

రొద్దం: వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ శివకుమార్‌నాయక్ అన్నారు. మంగళవారం రొద్దం వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణం పనులను డీఈ పరిశీలించారు. నిర్మాణంపై లబ్ధిదారులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశను బట్టి బిల్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. కాలనీకి విద్యుత్ సౌకర్యం, రోడ్లు ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్, వర్క్‌ఇన్స్‌స్పెక్టర్ రంగస్వామినాయక్, కోఆప్షన్ మెంబర్ షఫీవుల్లా, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

పావగడ: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ చంద్రశేఖర్, గ్రంథాలయాధికారి టికే బసవరాజ్ సూచించారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులు, పోటీ పరీక్షలు ఎదుర్కొనే అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రొళ్ల, అగళి మండలాల్లోని తెలుగు, ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులకు మంగళవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు శ్రీధర్, మోహన్ ఆధ్వర్యంలో 6 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలను పెంచడానికి తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వసంత

హిందూపురం అర్బన్: పట్టుగూళ్ల ఉత్పత్తి, విస్తరణపై రాష్ట్ర పట్టు పరిశోధనా కేంద్రం కిరికెరలో పట్టు పరిశ్రమ అధికారులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పట్టు పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ శీతారాములు జ్యోతి ప్రజ్వలన చేశారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రొఫెసర్లు ప్రవీన్, వసంత, డిప్యూటీ డైరెక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్ మెలకువల గురించి శిక్షణ ఇవ్వనున్నారు.

ఎన్నికల ఏర్పాట్లు చక చకా

- పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ పూర్తి
- ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధం చేసిన వైనం
- నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,11,482



మడకశిర తహసీల్దార్ కార్యాలయం

మడకశిర: నియోజకవర్గంలో సాధారణ ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. త్వరలోనే రాష్ట్రంలో ఒకేసారి పార్లమెంట్, అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈసీ ఆదేశాల మేరకు అధికారులు ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

237 పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో మొత్తం 237 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఓటర్ల జాబితాను కూడా ప్రకటించారు. నియోజకవర్గంలో మొత్తం 2,11,482 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 1,06,948 మంది ఉండగా మహిళా ఓటర్లు 1,04,534 మంది ఉన్నారు. అమరాపురం మండలంలో 47,094, గుడిబండ మండలంలో 42,638, రొళ్ల మండలంలో 31,090, అగళి మండలంలో 26,895, మడకశిర రూరల్‌లో 46,728, మడకశిర అర్బన్‌లో 17,037 మంది ఓటర్లు ఉన్నారు.

పోలీసుల యంత్రాంగం సన్నద్ధం

పోలీస్ యంత్రాంగం కూడా ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైంది. ముఖ్యంగా పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించి వాటిపై ఇప్పటి నుంచే నిఘా పెంచింది.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



త్వరలోనే రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఈసీ ఆదేశాల మేరకు ఏర్పాట్లపై దృష్టి పెట్టాం. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేశాం. ఓటర్ల జాబితాను కూడా సిద్ధం చేశాం. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– మారుతీప్రసాద్, డీటీ, ఎన్నికల విభాగం, మడకశిర

నియోజకవర్గంలో ఓటర్లు ఇలా...

మండలం	మహిళా ఓటర్లు	పురుష ఓటర్లు
మడకశిర రూరల్	23,171	23,577
మడకశిర అర్బన్	8,657	8,380
అమరాపురం	23,361	23,733
గుడిబండ	21,010	21,628
రొళ్ళ	15,087	16,003
అగళి	13,248	13,647
మొత్తం	1,04,534	1,06,948

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: ముఖ్యమంత్రి చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు నూరుల్లా, ముషీరాబేగం తదితరులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆటోనగర్‌కు చెందిన సుమారు 150 మంది బీబ్లాక్ కన్వీనర్ వాటర్ నరేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సమీవుల్లా, అక్తర్, కలీం, సయ్యద్, అక్బర్, ముక్తర్, అజీం, సమీవుల్లా, ఫక్రుద్దీన్‌లతో పాటు పార్టీలో చేరిన వారందరికీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక కండువా వేసి ఆహ్వానించారు. దీపిక మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్న ఒకే లక్ష్యంతో జగనన్న పాలన సాగిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు బాబురెడ్డి, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, కౌన్సిలర్ శివ, నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, డాక్టర్ బాష తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

మడకశిరరూరల్: రాజకీయ లబ్ధి పొందేందుకు గ్రామాల్లో టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, వైస్ ఎంపీపీ మూర్తి, బీసీ, ఎస్సీ సెల్ నాయకులు జమ్మానిపల్లి మూర్తి, హెచ్‌ఆర్ పాళ్యం సత్యనారాయణ, మంజునాథ్, లక్ష్మీనారాయణ, రంగనాథ్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. మళ్లీ రాజకీయంగా లబ్ధి పొందడానికి ప్రభుత్వంపై అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షణ పథకాన్ని అమలు చేసి భూరీసర్వే చేసి రైతులకు మేలు చేస్తుంటే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

అమరాపురం: మండల పరిధిలోని దేవగానపల్లికి చెందిన మంజునాథ అనే వ్యక్తి ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాలమేరకు.. మంజునాథ దేవగానపల్లి నుంచి అమరాపురం మీదుగా హాలుకూరుకు తన ద్విచక్ర వాహనంలో స్నేహితులతో కలసి బయలు దేరారు. జాలిబావి క్రాస్ వద్ద బైకు అదుపు తప్పింది. దీంతో మంజునాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మడకశిర ఆస్పత్రికి తరలించారు.

చంద్రబాబు నిర్దోషి కాదు

- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి



సోమందేపల్లి: స్కిల్ స్కాం కేసులో అడ్డంగా దొరికిపోయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు బెయిల్ వచ్చిన మాత్రాన నిర్దోషికాదని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన సోమందేపల్లిలోని విలేకరులతో మాట్లాడారు. బెయిల్ ఇస్తే కేసు కొట్టివేసినట్లుగా భావించి టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబుకు తప్పు చేయలేదని కోర్టు ఎక్కడ క్లీన్ చిట్ ఇవ్వలేదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అన్ని అధికారాలతోనే సీఐడీ కేసు నమోదు చేసింది కాబట్టి చంద్రబాబుకు శిక్ష పడటం ఖాయమన్నారు. అనారోగ్యం రీత్యా ఇచ్చిన బెయిల్‌ను రెగ్యులర్ చేసినంత మాత్రాన బాబు భజన బ్యాచ్, ఎల్లో మీడియా చేస్తున్న హడావుడి విడ్డూరంగా ఉందన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

పరిగి: మండలంలోని శాసనకోటలో బుధవారం వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. స్థానిక సచివాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

గోరంట్ల: గోరంట్ల పంచాయతీలోని 4వ సచివాలయం పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొంటారన్నారు.

రొళ్ల: మండలంలోని దొడ్డేరి సచివాలయం ఆవరణలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ అనిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

25లోగా దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ: సీడాప్, డీఆర్‌డీఏ ఉమ్మడి అనంతపురం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత శిక్షణకు నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని జాబ్స్ కోఆర్డినేటర్ లక్ష్మి తెలిపారు. రామగిరిలో 6 నెలల పాటు ఫైబర్ నెట్‌వర్క్ బ్రాడ్‌బ్యాండ్ టెక్నీషియన్ కోర్సుపై శిక్షణకు ఉంటుందన్నారు. ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించి శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఇతర ఉన్నత విద్య చదివిన నిరుద్యోగులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9889479371 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

పరిగి: మండలంలో మంగళవారం సెబ్ అధికారులు, పోలీసుల సంయుక్త దాడుల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. పరిగి పెన్నా నదిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



అగళి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హిందూపురం: జెండా ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త దీపిక, నాయకులు

అగళి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటా వివరించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. ఇనగలూరు సచివాలయం పరిధిలో రూ.21 కోట్లతో వివిధ పథకాల కింద పొందిన లబ్ధికి సంబంధించిన బోర్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ చేసిన మంచిని తెలియజేయడంతో పాటు మళ్లీ ఏపీకి జగనే ఎందుకు కావాలన్న విషయాన్ని వివరించాలన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక, రైతు భరోసా, విద్యాకానుక, అమ్మ ఒడి , వైఎస్సార్ ఆసరా, నాడు–నేడు, విదేశీ విద్యాకానుక, వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, జగనన్న గోరు ముద్ద, వైఎస్సార్ వాహన మిత్ర, జగనన్న చేదోడు, జగనన్న తోడు పథకాలను ప్రజలకు అందించామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రవిప్రసాద్, ఈఓఆర్డీ పద్మ, జేసీఎస్ కన్వీనర్ మహేంద్రప్ప, మండల కోఆప్షన్ మెంబర్ నసీర్, పంచాయతీ కార్యదర్శి అశోక, చంద్రప్ప, వేంకటస్వామి, సతీష్, రంగప్ప, సురేష్, గిరీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. హిందూపురం మండలం బెవనహళ్లి పంచాయతీలో గ్రామ సర్పంచ్ ఆనంద్, మున్సిపాల్టీ పరిధిలోని 1వ వార్డు కొట్నూరు కౌన్సిలర్ మల్లికార్జున ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా నాలున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వివరించేలా డిస్‌ప్లే బోర్డును సమన్వయకర్త టీఎన్.దీపిక ఆవిష్కరించారు.

మంచి చూసి ఓటేయండి

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో జరిగిన మంచిని చూసి ఎన్నికల్లో ఓటు వేసి జగనన్నను దీవించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందించి ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ నరేంద్ర, హనుమంతరెడ్డి, సర్పంచ్ దేవరాజు, జెడ్పీటీసీ నాగభూషణం, మండల కన్వీనర్ రాము, మూర్తి, మల్లేష్, హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, చంద్ర, గిరి, షాజియా, మల్లికార్జున, నాగమణి, జయప్ప, మహేష్, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఏబి బ్లాక్ కన్వీనర్ సాధిక్, నరేష్, జిల్లా కార్యదర్శి ఇలియాజ్, జేసీఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, గిరి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: పేద ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందని నగర పంచాయితీ చైర్మన్ ఉమ్మర్ ఫరూఖ్ పేర్కొన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని 3వ వార్డు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్, వైశాలి, జయశంకరరెడ్డి, తయూబ్, కొండలరాయుడు, పట్టణ కన్వీనర్ నరసింహులు, రాము, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర, సర్పంచ్ సదాశివప్ప తదితరులు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లతో కలిసి సంక్షేమ లబ్ధిని వివరించేలా ముద్రించిన బుక్‌లెట్లను అందిస్తూ ప్రచారం నిర్వహించారు. వైస్ సర్పంచ్ సీఎం ఘట్ట రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మారేగౌడు, మారన్న తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని గుణే మోరుబాగుల్ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సంక్షేమ పథకాల లబ్ధి పొందిన బోర్డును ప్రదర్శించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యంజారేగౌడ్ , సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ గుప్తా, ఈఓఆర్డీ నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కేవలం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేశ్వరి, ఎంపీపీ ఈరన్న,జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బసవనపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



పెనుకొండ: మా నమ్మకం నువ్వే జగన్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం



గుడిబండ: పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



రొళ్ల: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అమరాపురం: డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

నేడు హుండీ కానుకల లెక్కింపు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు హుండీ కానుకలను లెక్కించనున్నట్లు దేవాదాయశాఖ ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

మెనూ పాటించకపోతే చర్యలు

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్నే విద్యార్థులకు వడ్డించాలని ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం సూచించారు. మండలంలోని కాలువపల్లిలోని ప్రాథమిక పాఠశాలను వారు మంగళవారం తనిఖీ చేశారు. తొలుత పాఠశాల నిర్వహణ రికార్డులను తనిఖీ చేసిన అనంతరం విద్యార్థులతో పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: మండల పరిధిలోని కారూడిపల్లి ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం శివ గంగాధర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నరేంద్రకు వినతి పత్రం అందజేశారు. విధులను నిర్లక్ష్యం చేస్తున్న శివ గంగాధర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే విచారణ చేపట్టామని, నివేదికను డీఈఓకు పంపినట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు.

నేటి నుంచి 'రక్షణ సువార్త '

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో రెండు రోజుల పాటూ రక్షణ సువార్త కూడికలను నిర్వహిస్తున్నట్లు పాస్టర్ అబ్రహా తెలిపారు. స్థానిక క్రీస్తు ప్రార్థనా మందిరం 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చర్చి ప్రాంగణంలో బుధ, గురువారాల్లో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఫైలేరియాపై అప్రమత్తత అవసరం

అమరాపురం: ఫైలేరియా వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది, ఆరోగ్య ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య ఆశా కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. మండలంలోని హాలుకూరులో ఫైలేరియా వ్యాధి ఓ వ్యక్తికి సోకిందన్నారు. ఆ గ్రామానికి వెళ్లి అందరికీ రక్త పరీక్షలు చేయాలన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

అమరాపురం: మండలంలో టీబీ.వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా టీబీ అధికారి తిప్పయ్య పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ మనోహర్‌నాయక్, ఆరోగ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కమిటీ ఏకగ్రీవం

సోమందేపల్లి: ఫీల్డ్ అసిస్టెంట్ల మండల కమిటీని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా నరసింహమూర్తి, గంగాధర్, మంజునాథ్, ప్రధాన కార్యదర్శిగా సునీల్, కోశాధికారిగా చంద్రనాయక్, సహాయ కార్యదర్శులగా రమేష్, సిగ్బతుల్లా, నరసింహ మూర్తిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం జిల్లా నాయకులు నాగరాజు, అమర్ పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



కరియమ్మదేవి



జ్యోతులతో భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడిగెర గ్రామంలో మంగళవారం వైభవంగా కొల్హాపురి మహాలక్ష్మీదేవికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా ఒకరోజు ముందే గ్రామానికి ఊరేగింపుగా మోసుకువెళ్లి నడిబొడ్డున పట్టం కూర్చోబెట్టారు. తర్వాత మహిళలు జ్యోతులను మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.

అగళి: మండల పరిధిలోని ఆలుడి గ్రామంలో వెలిసిన కరియమ్మదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూల విగ్రహాన్నికి వెండి ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహా మంగళ హారతి ఇచ్చారు.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం



హొట్టేబెట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రొళ్ల: ఎయిడ్స్ మహమ్మరిని సమూలంగా నిర్మూలిద్దామని ఫోర్డు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ అశ్వత్తనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హొట్టేబెట్ట సచివాలయం, ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫోర్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంతో సచివాలయం సిబ్బంది, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. తర్వాత విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ అశ్వత్తనారాయణ పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు.

చిలమత్తూరు: హెచ్‌ఐవీ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం డీఆర్‌పీ రమేష్ యాదవ్ సూచించారు. మంగళవారం మండలంలోని దేమకేతేపల్లి గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ ఎలా సోకుతుంది, ఎలా సోకకుండా ఉంటుంది తదితర అంశాలపై అవగాహన కల్పించారు.